# దేవీ సాక్షాత్కారము

"మూర్తిశ్రీ"

రాత్రి పన్నెండుగంట లయింది. ప్రపంచం అంతా గాఢ నిద్రలో ఉంది. ఆ పూట యీన్నే వర్షం పడటంవలన, కప్పల బెకబెక తప్ప ఇంకే శబ్దం లేదు. గుడ్డివెన్నెల కాస్తూంది. సామాన్యుడు నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతున్నాడు. ఎంత ప్రయత్నించినా సామాన్యుడికి నిద్రపట్టడం లేదు. అసలు అతనికి నిద్ర పట్టిరా పట్టకపోయినా పట్టింపు లేదు ఎందుచేతనంటే కొద్దిరోజులనుండి సామాన్యుడు పూర్తిగా వేదాంతాన్ని మననం చేసుకొంటున్నాడు. ఇలాంటి పరిస్థితులతో నిండిన కాలంలో, అతనికి వేదాంతమే శరణ్యంలాగ తోచింది. ఇతఃపూర్వం సామాన్యుడు కొంత మట్టుకి నాస్తికుడే అయినా, పరిస్థితులనుబట్టి అతనికి జీవాత్మ, పరమాత్మ, యిత్యాది పదాలంటే చాలా గౌరవం కలిగింది. సామాన్యుడు నిద్రపోదామని కళ్ళు మూశాడు. కాని నిద్ర రాక పోవటంవలన ప్రక్కకి తిరిగేడు. సామాన్యుడి భార్య సగం చిరిగిన కోక కట్టుకొని నిద్రిస్తున్నుంది. సామాన్యుడి కొడుకు తల్లిదగ్గర పాలు తాగుతున్నాడు. ఎంత చప్పరించినా, వాడి దాహం తీరినట్టు లేదు. అసలు సామాన్యుడి భార్య యీ మధ్యనే నలభైసంవత్సరాల స్త్రీలాగ తయారయింది. వాస్తవికంగా ఆమె వయస్సు యిరవై సంవత్సరాలు.

సామాన్యుడు వారిద్దరి వైపూ చాలా జాలిగా చూశాడు. అతనికి కన్నీరు కార్చడానికి శక్తిలేకపోయిందో లేక అతని హృదయం కష్టాలతో పాషాణం అయిపోయిందో! అకస్మాత్తుగా సామాన్యుడు త్రుళ్ళిపడ్డాడు. గోడపైని నల్లనినీడ అతన్ని బెదరించింది. అతను భయంతో గజగజలాడుతున్నాడు. అర్ధరాత్రివేళ ఏవైనా దెయ్యాలు కాని అతన్ని హింసించడానికి వచ్చాయేమోనని భయపడ్డాడు. ఇప్పుడుపడుతున్న కష్టాలతోడు యీ పిశాచం కూడానా అనుకున్నాడు. గట్టిగా కళ్లు మూసుకున్నాడు. ఈ సారి నీడకాకుండా ఒక బక్కచిక్కిన స్త్రీ ఆకారం కనిపించింది. నల్లచీర కట్టుకుంది ఆ స్త్రీమూర్తి. జుట్టు విరబోసుకుంది. నోరావులించి సామాన్యుణ్ణి మింగేద్దామన్నంత కోపంగా చూస్తూంది. సామాన్యుడికి యింకా భయం ఎక్కువై పోయింది. మెల్లగా కళ్లు విప్పేడు. మళ్ళీ నల్లటినీడ కనిపించింది. సామాన్యుడికి యింతాక కనిపించిన స్త్రీమూర్తికన్నా యీ నీడే కాస్త నయంగా తోచింది. అయినా అతని భయం తగ్గలేదు. అందుతో సంబంధించిన వణుకు కూడా తగ్గలేదు. సామాన్యుడు ధైర్యం చేశాడు. వణుకుతున్న కంఠంతో 'ఎవరు నువ్వు?' అన్నాడు.

'...............'

'నిన్నే. ఎవరు నువ్వు?'

ఆ నల్లనిమూర్తి అట్టహాసంగా నవ్వింది.

ఆ నవ్వు సామాన్యుడి హృదంతరంలోనికి దూసుకుపోయింది.

'నేనెవరినో తెలుసుకోలేవన్నమాట.'

'ఔను. అందుకే నిన్ను అడుగవలసి వచ్చింది' చాలానీరసంగా అన్నాడు సామాన్యుడు.

'నన్ను తెలియనివారు ఎవరూ లేరనుకుంటే నువ్వు కనిపించావు.'

'సరే కాని, యింక అట్టే నన్ను చంపక ఎవరివో ఎందుకొచ్చావో ఎలాగొచ్చావో చెప్పు.

ఏమంత నీరసంగా మాట్లాడుతున్నావ్?'

'నాల్గు రోజులనుండి తిండి లేదు.'

నీడ సగర్వంగా నవ్వింది.

'ఎందుచేతనో?'

'నూకలు లేవు. చెప్పు ఎవరివో చెప్పు.'

'చెప్పేదా? ఒద్దు సుమీ! నన్ను చూసి బెదరగలవు.'

'ఎందుకు బెదురుతాను?'

'నాగురించి నీవొక రూపాన్ని స్థిరపర్చుకున్నావు. కాని నేను ప్రస్తుతం అన్నట్టు చూడడంవలన బెదురుతావు.'

'బెదరకు. ఎవరినో చెప్పు!'

'నేను ఎవరినో యింకా అర్థం కాలేదా?... విను నీ తాలూకు నిరంతర తపస్సుకు ఫలాన్ని.'

'అంటే.'

'నీ మనోరథాల నీడేర్చి నిన్ను భూలోక స్వర్గపు పౌరునిగా తయారుచేయడానికి నిర్ణయించుకున్న వ్యక్తిని.'

'..............'

'నీ మహానాయకులు, నీ ఔన్నత్యానికి (!) కారణభూతులైనవారుపడిన శ్రమకు ఫలితాన్ని.'

'............'

'ఎంతో మంది యువకులు నాకు బలి అయిపోగా కనికరించివచ్చిన స్వరూపాన్ని...'

'............'

'నీ జాతిపిత అసమాన దీక్షాతత్పరతకి, అహింసా విధానానికి జోహారిడి వచ్చినదానను.'

ఈ మాట వినేసరికి సామాన్యుడికి కాస్త అర్థం అయింది.

'ఇంకా విను మరి. అస్తమించని సామ్రాజ్యపు ప్రభువుని బెదరగొట్టి నీ జాతి జనులు నన్ను పొందేరు. సామాన్యుడా యిప్పటికైనా నే నెవరినో తెలుసుకొని సగర్వంగా నిలబడు.'

'అంటే నువ్వు స్వతంత్రానివి అన్నమాట.'

'ఔను.'

సామాన్యుడి శరీరం బాగా వేడెక్కింది.

'ఛీ...నువ్వా' అన్నాడు.

'కోపం వద్దు సామాన్యుడా శాంతించు.'

'ఆ కాలం పోయింది. నాకు శాంతం అనేది వెదకినా కనిపించదు.'

'ఏం యిలాగ చిక్కి సగం అయిపోయావు?'

'సిగ్గులేదూ అమాటకి? చిక్కి సగం అయిపోయానా? చూడు. ఎముకల గూడు తప్ప యిందేమిటి? ఇందులో మూడు చుక్కల రక్తం చూపించు'

'అయితే నన్నేం చెయ్యమంటావు?'

'నువ్వా? దీనంతటికీ నువ్వే కారణం నువ్వే.'

'నేనా!'

'ఔను నువ్వే...నువ్వే...నువ్వే...'

'ఎలాగు.'

'నిన్ను చూసి ఎంతో ఆశపొందేం. నువ్వు రాకపూర్వం నీగురించి ఎన్నో తీయని కలలు కన్నాము. నీరాకతో మాజన్మతరించిపోతుందని మాదేశంలో రామరాజ్యం అవతరిస్తుందని ఆశించేం.

'...............'

'కాని మా ఆశలన్నీ ఫలించనివిగా ఉండిపోయాయి. మా కలలన్నీ కల్లలయిపోయాయి. చీకటిని చూచి వెన్నెలని భ్రమించేము. ముళ్ళబాటని చూచి ప్రమాదరహితమైన రహదారి అని అపోహపడ్డాం.'

'............'

'పూర్వం నలుగురితో ఒక్కసారి కుస్తీ పట్టడానికి వీలుగా ఉండే నేను, యీనాడు రక్తమాంసరహితమైన ఎముకల పంజరంగా తయారయాను. నా భార్యని చూడు! యిరవై ఏళ్ళ స్త్రీ. పాలుగారే జవ్వని. ఎలాగుంది? ... నలభై సంవత్సరాల వృద్ధురాలుగా లేదూ... యిదంతా నీరాకకి ఫలితమే.'

'............'

'సస్య శ్యామలమైన భరత దేశంలో తిండిలేక నీ ఆగమనం తర్వాత ఎంతమంది నాశనమై పోయారో! అసలు నువ్వు అడుగు పెట్టగానే రక్తపాతం...యిదేనా నీరాక ఫలితం... చెప్పు...స్వతంత్రమా చెప్పు...నీ బిడ్డలు ఆకలికి, జీర్ణించిపోయి కృశించి, నాశనమై పోతున్నారు. ఏనాడయినా యిలాంటి రోదన ధ్వనులు విన్నావా...యిలాంటి ప్రత్యక్షనరకం కన్నావా? తల్లీ యింక యీనరకానికి స్వర్గప్రాప్తి లేదా? నా భార్య, నా బిడ్డలు చూడు ...యిలాంటి నీకోసమా మా నాయకులు శ్రమించేరు...యిలాంటి నీకోసమా నా సోదరులు ఎంతమందో ఆహుతి అయిపోయారు? వెళిపో... యింక నాకు వెర్రెత్తిపోతుంది. నువ్వు స్వతంత్రానివి అని చెప్పడానికి నాకు సిగ్గుగా ఉంది. తిరిగి కలకలలాడుతూ సుమంగళిగా ఉన్న జవ్వనిలాగ నాదగ్గరకు రా...అనాడు నిన్ను గౌరవిస్తాను. ఆదరిస్తాన. దేశదేశాలకు నిన్ను చూపి గర్విస్తాను.'

'సామాన్యుడా...నువ్వు చెప్పింది నిజమే. నీలాంటివారిపాలిట నేను యమదూతనయ్యాను. నీలాంటివారికి రావణరాజ్యం చూపించేను..కాని ఏనాటికైనా మీకు మంచిరోజులు రాకపోవు. అయినా నన్ను సరిగ్గా ఉపయోగించ లేక

పోయారు మీ నాయకులు. సామాన్యుడా... నన్ను నిలబెట్టుకుందికి ప్రయత్నించండి. నా కాళ్లు తడబడుతున్నాయి...'

* * *

సామాన్యుడికి ఏదో ఆశ కలిగింది.

'అదిగో ఆ మహాత్ముని అనుసరించు' అని బోసినవ్వుల తాతను చూపింది. స్వతంత్ర రూపాన్ని చూస్తే సామాన్యుడికి భయం వేసింది. నీడ మెల్లగా కదలి పోయింది...

షావుకారు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. మధ్యలో ఎందుకో ఉలిక్కి పడుతున్నాడు. అతడే స్థూలకాయుడు. అందులో బొజ్జ. యిల్లు ఒక చిన్న భోషాణం పెట్టె. అందుకే షావుకారు ఒంటి నిండా చెమట్లు పోశాయి. అతనికి మధ్యమధ్యను తన యిల్లంతా ఎవరో దోచుకుపోయినట్టు కల వస్తోంది. అందుకని భయంతో శరీరం అంతా ఒణుకుతూంది. నోరావలించి నిద్రపోతున్నాడు. అందులోనుంచి ఎన్నిదోమలు వెళ్తున్నాయో అతని కెరుకలేదు. ఏదో చప్పుడయితే కళ్ళు విప్పి చూశాడు. అతనిభార్య మంచినీళ్ళ కని లేచింది. ధైర్యంగా కళ్ళు మూసుకొన్నాడు. ఈసారి అతనికి విచిత్రమైన కల వచ్చింది. ఆ కలలో ఎవరో ఒక అందమైన స్త్రీ, కురులు సవరించుకొని పసుపు రాసుకొని బొట్టుపెట్టుకొని అతనివైపు చూసి చిరునవ్వు నవ్వుతూంది. షావుకారుగారి శరీరం పరవశం అయింది. బొజ్జ తడుముకుంటూ దగ్గరగా వెళుతున్నాడు. ఆనందం పట్టలేక 'ఎవరు పిల్లా నువ్వు?' అన్నాడు.

'.............'

'ఎవరు? నన్ను తెలుసుకున్నావా? బంగారయ్యని' అని జేబులో ఉన్న రూపాయి నోట్లను లెక్కబెడుతున్నాడు గర్వంగా.

ఆమె అతనివైపు క్రీగంట చూచింది. షావుకారుకు ధైర్యం లావయింది.

'రా పిల్లా!...నీలాంటివారిని చాలామందిని మెప్పించేను...'

'నే నెవర్ని అనుకున్నావోయ్?'

'నీ సంగతి నాకు తెల్సులే.'

'కాదు...నన్ను నీ వపార్థం చేసుకుంటున్నావ్! నేను స్వతంత్రాన్ని...' సగర్వంగా పలికింది షావుకారు ఉలిక్కిపడ్డాడు. అతని ముఖం కాస్త విప్పారింది.

'తల్లీ! నువ్వా క్షమించు...నిన్నపార్థం చేసుకున్నాను.'

'.............'

'నీ మేలు జన్మజన్మాలకీ మరువలేను...యీనాటి నా స్థితికి నీవే కారకురాలవు తల్లీ...'

'.............'

'నీ ఆగమనానికి పూర్వం దరిద్రుడిగా, తెల్ల దొరల దౌర్జన్యం క్రింద నలిగిపోతూ ఉండే నేను యీనాడు సగర్వంగా నలుగురిలోనూ నిలబడుతున్నాను.'

'.............'

'నిజానికి నాకంట ఎన్భైగరిసెల ధాన్యం అయినా, ఆ ఆఫీసరుకి రెండు పచ్చకాగితాలు చూపి, పది గరిసెలనే రాయించి ఆ మిగిలినది నల్ల మార్కెట్‌లో చలామణీ చేస్తున్నాను.'

'.............'

'ఎక్కడచూచినా నా పేరే. రాబోయే ఎన్నికలలో నేను నిలబడుతాను కూడాను. తల్లీ నీ రాకతో నేను ధన్యుణ్ణయాను. నువ్వు యిప్పటిలాగానే ఎప్పుడూ ఉండాలని కోరుతాను. నా లక్ష్మీదేవివి నువ్వు.'

'ఆగు...యింక నీస్వంత పొగడ్త తగ్గించుకో. బాగుంది నావల్ల నీవు బాగుపడ్డావు నావల్ల నీ జీవితం పావనమయింది. నీజన్మ తరించింది. ఈనాడు పెద్దపెద్ద భవనాలలో నీలాంటివారు నివసిస్తున్నారు బాగుంది. నారాక అనంతరం నీ భార్యకి నగలు చేయించావు. కావలసినంత ఆర్జించేవు. పెద్ద బొజ్జ పెంచావు. కాని దీనంతటికీ కారణం ఎవరు? నీతోటి సోదరులు. వారి కన్నీటి అర్ణవంలో నా, నీ జీవిత నౌకాయానం? వారి దుఃఖాశ్రువు లేనాటికైనా తుపానుగా మారి నీ జీవిత నౌకని కాలద్రోయ్యక పోవు. నీకు దైవదత్తంగా వచ్చిన ఐశ్వర్యాన్ని, నీతోటి సోదరుల సౌభాగ్యపుటభివృద్ధికి ఉపయోగించు. అనాడే నీ జీవితానికి నిజమైన సాఫల్యం. వస్తాను. నన్ను యీనాటికైనా అర్థంచేసుకో. నేను చెప్పిన వాక్యాలు మరువకు!' ఆ స్త్రీమూర్తి మెల్ల మెల్లగా కదలిపోయింది. షావుకారు కన్ను విప్పేసరికి ఎవరూ లేరు. భయంతో, షావుకారిణిని గట్టిగా కౌగలించుకున్నాడు.